ఎప్పటికైనా భారతీయ భాషలే భారతీయ అధికార భాషలు అవుతాయి.

దేశంలోని పదు నాల్గు భాషలకు సమాన ప్రతిపత్తి కలగాలి. ఆయా రాష్ట్రాలలో ఆయా భాషలు అధికార భాషలు అవాలి.

● ● ●

## కైరాన్ హత్య

ఢిల్లీకిపందొమ్మిది మైళ్ళదూరంలో వచ్చేపోయే వాహనాల రద్దీతో నిండిన హైవేలో పట్టపగలు శ్రీ ప్రతాప్‌సింగ్ కైరాన్ దారుణంగా హత్య కావింపబడ్డాడు. హత్య చేసిన నలుగురు 15 మైళ్ళు చేలకడ్డం పడి నడిచి, తాపీగా కోడిగుడ్లు, నారింజలు తింటూ పోలీసుల కన్నుగప్పి మాయమైపోయారు. దేశం మొత్తంమీద కనీవినీ యెరుగని దారుణ హత్య.

ఢిల్లీపోలీసులు, పంజాబు పోలీసులు, కొంత స్పెషల్ సి. ఐ. డి. బృందం కలిసి తీవ్రంగా పరిశోధిస్తున్నా ఇంకా హంతకులు పట్టుబడలేదు. పోలీసు కుక్కలు నేరం జరిగే ప్రదేశానికి నాలుగు గంటలు ఆలస్యంగా చేరడంవల్ల దోషులను పట్టుకొనడంలో 'అడుగుల వాసనను' ఉపయోగించుకోలేక పోయినాయట.

కైరాన్ హంతకులను పట్టుకునేందుకు 'క్లూ'ల కోసం కైరాన్‌కు సంబంధించిన కొన్ని పాత కేసులను పోలీసులు తిరగవేస్తున్నారుట.

ఏది యేమైనా హంతకులకోసం పోలీసుల పరిశోధన ఇంకా సాగుతూనేవుంది.

శ్రీ ప్రతాప్‌సింగ్ కైరాన్ భారత చరిత్రలో మరువురాని వ్యక్తి. దేశ విభజనతో, అకాలీ ఉద్యమంతో, భాషా వైషమ్యాలతో గిజగిజలాడిన పంజాబ్‌ను 'వెన్ను చరిచి' నిలబెట్టి, అభ్యుదయ పథానికి ఏకోన్ముఖం చేసిన వ్యక్తి. ప్రజాశక్తిని సమీకరించడంలో అద్భుత ప్రజ్ఞను చూపించారాయన. "షేర్—ఇ—పంజాబ్" అని ప్రజలచేత మన్నన పొందాడు. రాజకీయ వ్యాఖ్యాతలు ఆయన్ని "హ్యూమన్ డైనమో" అన్నారు.

తన కార్యక్రమాలు జరిపించే వేగంలో 'సూటిగా' పోవటంవల్ల కొన్ని సందర్భాలలో ఆయన పనులు 'అన్యాయాలు'గా అనిపించిన మాట కూడా వాస్తవమే. ఏమైనప్పటికీ దేశ రాజకీయ చరిత్రలో శ్రీ కైరాన్ హత్యతో ఒక గొప్ప "కాంట్రవర్షియల్ ఫిగర్" అంతమై పోయాడు.

ఆయన చేసిన 'చెడ్డ పనుల'ను మరిపించి 'మంచి పనులు' ఆయన పేరును భావితరాలకు "షేర్—ఇ—పంజాబ్"గా గుర్తు చేస్తూనే వుంటాయి.

—అనంతం.



# పొగడ్త

ముళ్లపూడి వెంకటరమణ

చదువులూ, సలహాలూ అంభూ వీడెవడో ఇక్కడ తిష్టెయ్యాలని చూస్తున్నాడు గాని ఈ శషభిషలేం కుదరవని చెప్పు ... అంటూ కుండ బద్దలు కొట్టేస్తున్న ముసలాయన్ని చూసి వినయంగా నవ్వి ... తవరేనా నులకఅగ్నిహోత్రావధాన్లుగారు. ఈ పట్టున జటులో తమంతవారు లేరని డిప్టీ కలెక్టరుగారు తరుచు సెలవిస్తూ వుండేవారండి ... అన్నాడు గిరీశం. అగ్నిహోత్రుడు అమాంతం చల్లారి అయిపోయాడు. ఆ ఒక్క రస్సాతో గిరీశం కథని చాలాదూరం నడిపాడు.

పొగడ్త మహాత్మ్యం అంతటిది. అది అహంకన్న ఎత్తు. దురాశకన్న చిన్న. దుర్మార్గుడి ఆలోచనకన్నా లోతు. మంచివాని మనసుకన్న విశాలం. అణువంత చిన్నది, బ్రహ్మాండంకన్న పెద్దది. కుటిల రాజనీతికన్న వక్రం. పొగడ్త విశ్వరూపాన్ని దర్శించడం బ్రహ్మాతరం కాదు. వర్ణించడం వేయి నాలుకలున్న ఆదిశేషువు తరంకాదు. దేవతలు, దానవులు, మానవులు—శిశువులు పశువులు పక్షులు అందరూ, అన్నీ దానికి దాసోహం అనక తప్పదు. భగవంతుడితో పనంతా స్తుతితోనే మొదలవుతుంది. తొందరగా పనికాకపోతే, భక్తసులభుడివి అంటూ ఓ రస్సా వేస్తారు.

### ఇంద్రజాలం

అహంకార మమకారాలను ఆత్మ



వంచనలో రంగరించి ఉడకేసి ఆహా ఓహోలు పోపువేస్తే హుషారైన పొగడ్త తయారౌతుంది. అక్కడి నుంచి ఆ యా వ్యక్తుల రుచులనుబట్టి పరనింద, పరవంచన, ద్వేషం, హేళన, ఆనందం, ఆహ్లాదం, దిగులు,అసూయ, స్పర్థ వగైరాలను పాళ్ళప్రకారం కలిపితే మసాలా గుమాయిస్తుంది. చెప్పిన ముడిసరుకులను బట్టి యిది విషమని అనుకోవద్దు.ఒకవేళ చెప్పినా అదే అమృతమని మీరు పురిపెడు పుచ్చుకోక మానరు. ఎందుకంటే యిచ్చేవాడి హృదయాన్నిబట్టి పుచ్చుకునేవాడి బుద్ధినిబట్టి దీని రంగు రుచి ప్రభావం ఫలితం మారుతాయి. ఇచ్చింది విషమైనా, పుచ్చుకోడం చేతనైతే ఔషధం అవుతుంది. కొందరికెంత మేలు చేస్తుందో మరి కొందరికి అంత కీడూ చేస్తుంది. అది అగ్నిలాంటిది. అణుశక్తిలాంటిది. ఎలా వాడుకుంటామన్నది మన చేతిలో పని. పొగడ్తకి విధిగా కనీసం రెండు శాల్తీలుండాలి. పొగిడేది, పొగిడించుకునేది. చూసి ఆనందించడానికో లేదా కామేశ్వరరావుగారన్నట్టు... నన్ను పొగడలేదనో ఆ వెధవని పొగిడేస్తున్నాడే అనో దుఃఖించడానికో మూడో శాల్తీ పక్కనుంటే మరింత రక్తి కడుతుంది. ఎవరికి? వినేవాడిక్కాదు. నాలుగోవాడికి. పొగిడించుకునేవాడికి జనంవుంటే ఆనందమే కాని, లేకపోయినా దిగులుండదు. గంటలతరబడి, రోజులతరబడి ఇంకోడి నోట వినగలిగేమాటలు మన గురించిన పొగడ్తలే. ఎంత గొప్ప కథ, కావ్యం, పురాణం అంత రక్తి కట్టవు. అదో ఇంద్రజాలంలాంటిది. ఎదటివాడు మన్ని పొగుడుతున్నాడని తెలిసికూడా, మనం అలా జారిపోయేది యీ పొగడ్తల అగడ్తలో మాత్రమే.

## ఉగ్గుపాలతో అలవాటు

భగవంతు డంతటివాడి కిది అలవాటు. కాగా, మనుషుల దేముంది?



మనుషులేకాదు—కాకిబావ? తను గానకోకిలను కానని తెలిసినా నక్కబావ వచ్చి ఒక్కపాట పాడమనేసరికి కాకిబావ పొంగిపోయి సాపాసాలు పట్టుకుని మాంసంముక్క నక్కపాలు చేసుకుంది.

మనం పిల్లలికి యీ కథ చెప్పినపుడు ముఖస్తుతివల్ల **మోసపోయి** కాకిబావ నోటిదగ్గిర **కూడు** ఎలా పోగొట్టుకుందో తెలియజెప్పం. నక్కబావ ఒక్క మస్కాతో ఎలా కాకిని బోల్తా కొట్టించిందో చెప్తాం. పిల్లలకి పొగడ్తని ఉగ్గుపాలతో అలవాటు చేస్తాం. ఆవదం పెట్టేవేళ అమ్మ నాన్న నాయనమ్మ, [illegible]య్య, ఉంటే గింటే తాతయ్య పక్కింటి పిన్నిగారు యావన్మందీ చేరి — బాబూ ఎంత బంగారు తండ్రమ్మా అంటూ బృందగానం చేస్తారు... పిలితే అల్లవారి పిల్లాడో, తమ్ముడో ఎంత దుర్మార్గుడో కూడా చెప్తారు. ఆ తరవాత అన్నం తినడానికీ, ఎక్కాలు చదవడానికీ, ఆడడానికీ పాడడానికీ, అల్లరి మానడానికీ అన్నిటికీ భయభక్తులను మించి పనిచేసే చిట్కా - నీ అంతవాడు లేడురా అన్న ఒక్క ముక్కే. అలా ఎదిగి వాడికి వయసొచ్చేసరికి, వాడు దాన్ని స్వయాన ప్రయోగించడంలో ఆరితేరుతాడు. అందువల్ల పిల్లలికిది విధిగా అలవాటు చెయ్యాలి. అబద్ధాలు చెప్పడం, ఎదటివాడిని ఒడుపుగా పొగడ్డం ఈ రెండు ఈ నాటి జీవితానికి నిత్యావసర వస్తువులు. ఎంత మంచివాళ్ళకూ, గొప్పవాళ్ళకూ కూడా తప్పనిసరి విధులవుతున్నాయి. అందువల్ల పిల్లలు అబద్ధాలు చెబితే కోప్పడకండి, నేర్చుకోనివ్వండి — అని ఇటీవల ఒక అనుభవశాలి అన్నాడు.

## భట్రాజయోగం

ఎందుకంటే ప్రశంస అన్నది ఒక పెద్దశాస్త్రం. దానికో వ్యాకరణం, లయ, ఛందస్సు వున్నాయి. శాస్త్రం నేర్చాక ఎవడి మటుకువాడు లలితకళగా అందులో కృషిచెయ్యాలి. చాలా కష్టసాధ్యమైనకళ అది. పూర్వం రాజయోగం తరవాత భట్రాజయోగానికి విలువుండేది. రాజుగారిని నిత్యం పొగిడేవాడు కాబట్టి, వారిదగ్గిర మంత్రికన్న ఎక్కువ పలుకుబడి గలవాడుగా చెల్లేవాడు భట్రాజు. ఇపుడు– ప్రజలు రాజులై, రాజులు మంత్రులై, మంత్రులు మామూలు ప్రజలై, ప్రజలు ఎక్కువై, ప్రపంచం రద్దీ అయిన రోజుల్లో అందరికీ భట్రాజయోగం పట్టింది. ఎవరి అవసరం లేకుండా ఎవరూ బతకలేరన్న సత్యం రుజువై "నోమాన్ ఈజె నైలెండ్ అన్నది మహాకావ్యమైంది. ఆఫ్రికా వాడికీ అలమూరువాడికీ పరస్పరం అవసరాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ఎదటివాడి గురించి ఓ మంచిమాట అనడం అందరికీ మామూలే.

## మాటలు, చేతలు

అయ్యా, మీ మీసాలు బాగున్నాయి. మీ చొక్కా అంతగొప్పది అంత చవగ్గా మీరే కొనగలరు. నాకో పదిరూపాయలు అప్పుకావాలి అంటే ఎదటివాడు దేవుడిలా పొంగి

పోడు. అప్పివ్వడు సరిగదా పాత బాకీ వుంటే వసూలు చేస్తాడు.

పొగడ్త స్థూలంగా రెండువిధాలు. ఒకటి మాటలద్వారా పొగడడం. రెండు — చేతల ద్వారా పొగడడం. అంటే వాళ్ళకిష్టమైన పనులు చెయ్యడం, వాళ్ళకి గిట్టనివాళ్ళని తిట్టడం, వాళ్ళలాగే బట్టలు వేసుకోవడం,





వాళ్ళు అనే పదాలే అలవరచుకోవడం వగైరాలు.

మాటలద్వారా చేసే స్తుతి మళ్ళీ రెండురకాలు. ఒకటి స్తుతి; రెండు నిందాస్తుతి—తిడుతూ మెచ్చుకోడం. మొదటిదాంట్లో గుంభన వుంటుంది. గొప్ప గొప్ప కళాకారులు-పొగడ్తగా చేసే ప్రసంగాలు వింటే ఇందులో ఒడుపులు తెలుస్తాయి. "పిన్నిగారూ మీరు మంచివారు, కాస్త కాఫీ పొడుం బదులిస్తారా ?..." అని బయటుపడే బదులు, "పిన్నిగారూ, మీ నాగపూరు కప్పుతో నాగపూరు కప్పు దివ్వండి. కప్పుకూడా ఓ సారివ్వండి. మావాడు దాంతోగాని కాఫీ తాగడు" అనో "మావారోసారి చూస్తానన్నా"రనో అంటే కాస్త కాఫీ తాగించి మరీ పంపుతారు పిన్నిగారు.


"అదేనిటోనండీ, మీ యింట్లో కాకరకాయ కూరేనా సరే యెంతిష్టంగా తింటానో ... మా అవిడ చెప్పుతుంది కూడాను ... నేనేం చెయ్యను చెప్పండి. నోటి కేది హితవుగావుంటే ..." అనడం ఒక రకం శిల్పం.

నిందాస్తుతి ఇంతకన్నా శ్రేష్ఠం... "ఏమండీ, తిడుతున్నానని మీరేమీ అనుకోకండి—మీ రొట్టి ఫూల్స్. ఎందుకూ పనికిరారు. బొత్తిగా ఇంత మొహమాటం, ఇంత జీవకారుణ్యం అయితే ఎలాగండి ? అందుకే యిలా వున్నారు. ఛీ ! ఐ హేట్ యు..." ఈ ధోరణిలో ఎన్ని తిట్లు తిట్టినా రాణిస్తాయి. ఎంత తిడితే అంతప్రేమ. ఆ తరవాత మీరు అయనింట్లో షేరుహోల్డరులాగా తిరగొచ్చు.






పరనిందాస్తుతి మరో రకం. "వాళ్ళ కొత్తిల్లు చూశానండీ" ... ... కాస్త ఆగాలి... "హు" ... ... నిట్టూర్చాలి ... మీరు పొగడదలచుకున్న సుబ్బయ్యగారిల్లంతా ఓసారి కళ్ళు విప్పారిచూడాలి ... హుఁ, నిట్టూర్పు. ఈపాటికి శ్రీమతి అండ్ శ్రీ సుబ్బయ్యగారు చెవులు రిక్కించుకుని కూర్చుంటారు నరసన్నగా రింటిమీద మీ తీర్పుకోసం ... "హుఁ ... కేస్తుండాలి సార్. ఏం లాభం. మీకన్న ఓ లక్ష ఎక్కువే ఖర్చయిందని చెప్పుకుంటున్నారు ... ఏదీ అంతా వేస్టు ... ... సత్రమే ... ..." ఆనందంతో వెలిగే సుబ్బయ్యగారి మొహాన్ని వేరేలైట్లు లేకుండా కలర్ ఫొటో తియ్యొచ్చును. రెండోశాఖ—చేతలద్వారా, సూచనగా మెచ్చుకోవడం. యజమాని తొడిగే చొక్కాల్లాంటివే కుట్టించి ఆయన చేతులు మడిచినట్టే మడవడం, ఆయన ఊతపదాలు అనడం వగైరాలు యీ కోవలోకి వస్తాయి.



అందికే—ఇమిటేషన్ ఈజ్ ది బెస్ట్ ఫ్లారమ్ ఆఫ్ ఫ్లాటరీ—అన్నారొకరు.

## సందర్భశుద్ధి

ఎలక్షను సీజన్‌లో ఇంకో టెక్నిక్ బాగా కనిపిస్తుంది. ముక్కూ మొహం ఎరగనివాళ్ళంతా మీ యింట్లో అందరినీ కుశలం అడుగుతారు. మీరు చూస్తుండగా మీ పిల్లల్ని చీవిడి ముక్కుతో సహా (ఏమనుకోకండి) ముద్దెట్టేసుకుంటారు. చీవిడికూడా తుడవరు. తుడిస్తే మీరు నొచ్చుకోవచ్చు. ఒకటిమాత్రం నిజం. వ్యక్తికన్న వాడి సృష్టిని—రచన, చిత్రం, పిల్లలు వగైరాలను—మెచ్చుకోడం గొప్పపద్ధతి.

పొగిడేటప్పుడు సందర్భశుద్ధి చూసుకోవడం ఒకటి చాలా ముఖ్యం. బొటనవేలు పగిలో, ఇంట్లో కష్టం వచ్చో ఏడుస్తున్నప్పుడు ముందూ వెనకా లేకుండా ఆయన రచననో, నటననో మెచ్చుకోగూడదు. అలాగే, పొగిడేవాడు కొండంత దుఃఖంతో వెళ్ళి వెక్కెక్కి ఏడుస్తూ మెచ్చుకోగూడదు. పొగిడే అంశం గూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. రచయిత దగ్గరకెళ్ళి "మీ చిత్రాలన్నీ కళాఖండాలు సార్ ... నాకు వేషం కావా"లంటే చెడుతుంది. ముఖ్యంగా ఆడవాళ్ళ దగ్గర ఒక సూత్రం పాటించాలి. మరీ అంద

విశారిసీ,మహా సౌందర్యవతినీ పొగిడే టపుడు అందంకన్న వాళ్ళ మేధను మెచ్చుకోడం శ్రేయస్కరం. అందమైన స్త్రీకి మనం కొత్తగా చెప్పేదేం లేదు. అందం లేదని ఖాయంగా అనుకునే స్త్రీకి — అలాంటి వారు అరుదు—ఆ సంగతి చెప్తే మోసగిస్తున్నామని కోపంవస్తుంది. అందువల్ల వాళ్ళ తెలివినే మెచ్చుకోవాలి. అందమైన అమ్మాయికి అది మరీ ఆనందం కలిగిస్తుంది. అటూ యిటూ కాక మధ్యరకం అందంగల అమ్మాయిని ప్రబంధకవిలా పొగడొచ్చు. పొగడినకొద్దీ ఫలితం.

## అతి వినయం

పొగడడం ఎంత గొప్ప కళో పొగడ్త అందుకోవడంకూడా అంత గొప్పదీను. అందులో ఒక సంస్కారం ఉండాలి. కనీసం పైపై కన్నా చూపాలి. ఎదటివాడు మనని మెచ్చుకుంటున్నపుడు—ఆ పోదురూ నేను వెధవని, అని మనం అంటే, వాడు అవమానపడతాడు. సవినయంగా స్వీకరించి కృతజ్ఞత తెలపాలి. మన రాజకీయ సన్మాన సభల్లో, కవితా సన్మాన సభల్లో ఇంచక్కగా చూస్తాం. కొందరు సన్మానితులు అతి వినయానికి పోయి—అప్పుడే ఎవరో దగ్గర బంధువులో, మహా నాయకుడో మరణించిన వార్త వచ్చినట్టూ, తప్పనిసరిగా ఇక్కడి సన్మాన సభ మధ్య తను తగులడాల్సొచ్చినట్టూ భంగిమ పెడతారు. వినయం ఎంత మంచిదయినా కొన్ని రకాల ప్రశంసల దగ్గిర మాత్రం బొత్తిగా కూడదు. ఒకసారి ఒక పతివ్రత సినిమాలో ఋషులు. దేవతలు వచ్చి......నువ్వు మహా పతివ్రతవు అంటూ పొగుడుతారు. ఆవిడ ఆ మీరేదో అభిమానానికంటున్నారుగాని నేను మీరనుకున్నంత గొప్పదాన్నిగాను...అన్న ధోరణిలో ఒక ముద్ర ప్రదర్శించింది. ప్రేక్షకులు గొల్లున నవ్వారు. అలాగే సన్మానసభ — 'వీరు దేశసేవా ధురంధరులు. నిస్వార్థ జీవులు. నిజాయితీకి పెట్టిందిపేరు...' అనిమెచ్చుకున్నప్పుడు వినయం అవంతకూడా ప్రదర్శించడం క్షేమం కాదు.

## ఇంకా కావాలనే ఆరాటం

ఈ వినయపరులు కొందరు దొంగలు. పొగిడితే అబ్బే అనేవాళ్ళు చాలమంది ఇంకో నాలుగుసార్లు పొగిడించుకుంది కిలా అంటారని— ఏనాడో షేక్స్పియర్ అన్నాడు.

నాటికి నేటికి ఏనాటికి ఎంతటి వారికి పొగడ్త ఇంద్రజాలమే. వ్యసనమైతే మనిషి నెంత దిగలాగుతుందో, తగు మోతాదులో వుంటే మనిషి నంతపైకెత్తుతుంది. తోటివాళ్ళ పొగడ్తవల్ల, అసాధ్యాలయిన పనులు చేసినఅర్భకు లున్నారు. ఆంజనేయుడంతటివాడు లంకకి ఎగరడానికి పనికొచ్చిన యింధనం—నీ అంతవాడు లేడయ్యా—అన్న పొగడ్తే.

□□□

